## మరింత భద్రతకే కొత్త పోలీస్ స్టేషన్లు



వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 15 జూన్, 2026 | పేజీలు : 06


# పనుల్లో జాప్యం ఉండొద్దు

### అయ్యగారు చెరువు పరిశీలనలోమంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం /పెద్దపల్లి :** మంథని పట్టణంలోని అయ్యగారి చెరువు సుందరీకరణ పనులను రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం పరిశీలించారు. చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మంథని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అయ్యగారి చెరువును అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని, పనులలో ఎటువంటి జాప్యం ఉండకూడదని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తవ్వాలంటే, అవసరమైతే రాత్రి, పగలు శ్రమించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ఆయన స్పష్టం చేశారు.ఈ పనులు త్వరగా పూర్తయితే పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పర్యటనలో స్థానిక అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో కరీంనగర్‌లో గెలిచేది కాంగ్రెస్సే

### డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** వచ్చే ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో గెలిచేది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థియే అని డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం నగరంలోని సీతారాంపూర్ పిఎం కన్వెన్షన్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ బిఎల్ఓ2 సభ్యుల శిక్షణ కార్యక్రమం, ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ఎస్ఐఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, లౌకికవాద ఓటర్లను లక్ష్యంగా చేసుకొని కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త, ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొని అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్, పిసిసిఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈనెల 25వతేది నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో బూత్‌స్థాయి నాయకులు, ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొని ప్రతి ఓటరును కాపాడాలన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని కోరారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే అరేపల్లి మోహన్, అర్బన్ డిసిసి అధ్యక్షుడు డా.వైద్యుల అంజన్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్‌లు మాట్లాడుతూ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొందించుకొని ప్రతి ఇంటిలో ఉన్న ఓటర్ల వివరాలను సమగ్రంగా తెలుసుకొనిఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, నాయకులు ఎం.డి.తాజ్,వరాల నర్సింగం, గంట శ్రీనివాస్, పర్వతం మల్లేశం, గుమ్మడి రాజ్‌కుమార్, మడపు మోహన్, కోమటిరెడ్డి పద్మకర్ రెడ్డి, పడాల అజయ్ గౌడ, కాంతాల జగన్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మూల రవిందర్ రెడ్డి, వేల్పుల వెంకటేశ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఆర్‌టిఏ సారూ...

# బడికి వేళాయే.. బస్సు భద్రమేనా?

### ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హతలు, భద్రతా ప్రమాణాలపై కఠిన తనిఖీలు తప్పనిసరి



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి సమయం ఆసన్నమైంది. జూన్ 16 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాల బస్సులు, వ్యాన్లు, ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాల ద్వారా ప్రయాణించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల రవాణా భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాలలు తెరుచుకునే ముందు రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాణాలను నిర్ధారించాల్సిన అవసరం



ఉందని ప్రజలు కోరుతున్నారు.ప్రతి ఏడాది పాఠశాలలు ప్రారంభమైన కొద్ది రోజులకే ఎక్కడో ఒకచోట పాఠశాల వాహనాలకు సంబంధించిన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలతో వాటిని నివారించడంపైనే అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వేసవి సెలవుల కారణంగా నెలల తరబడి నిలిపి వేసిన పాఠశాల వాహనాలు మళ్లీ రోడ్డెక్కే ముందు వాటి ఫిట్‌నెస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. బ్రేకులు, టైర్లు, స్టీరింగ్, లైట్లు, అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వంటి భద్రతా పరికరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అధికారులు నిర్ధారించాలి. బయటకు ఆకర్షణీయంగా కనిపించే వాహనాల్లో కూడా అంతర్గత భద్రతా లోపాలు ఉండే అవకాశాన్ని విస్మరించరాదు.

పాఠశాల వాహనాలను నడిపే డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే ట్రాన్స్‌పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జ్ ఉండాలి. వారికి తగిన అనుభవం ఉండటంతో పాటు కంటి చూపు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలపై నిర్దిష్ట వ్యవధిలో వైద్య పరీక్షలు నిర్వహించాలి. మద్యం లేదా ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలి.

## మెట్‌పల్లిలో వెలుగులోకి భారీ మోసం



వివరాలు మెయిన్‌లో...

## బడుల్లో 'బాహ్య' పరీక్షలు...

విద్యా ప్రమాణాల మెరుగుకేవిద్యాశాఖ కసరత్తు!



వివరాలు మెయిన్‌లో...

# ఎన్నికల హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు

### ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం




**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు, వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక డిక్లరేషన్లు ప్రకటించి వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని విడనాడి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 వేలు మాత్రమే ఇస్తామని చెప్పి రెండు దఫాలుగా రైతులకు రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారని గత రబీ సీజన్ పెట్టుబడి సాయం రైతు భరోసా నిధులు నేటికీ పూర్తిస్థాయిలో రైతుల అకౌంట్లో వేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఏప్రిల్ నెలలో ఎకరానికి రూ.6 వేలు రైతుల అకౌంట్లో వేసి చేతులు దులుపుకున్నారన్నారు. కౌలు భరోసా, కూలీ భరోసా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో రెండు పంటలకు కాకుండా మూడి పంటలకు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేసిన ముఖ్యమంత్రి నేడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి అటకెక్కించారని, ప్రతి సంవత్సరం జూన్ మాసంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యువకులను మోసం చేశారన్నారు. పెళ్లయిన ప్రతి ఆడబిడ్డకు కళ్యాణ లక్ష్మీ పథకం కింద లక్ష రూపాయలు, తులం బంగారం ఇస్తామని వాగ్దానం చేసి తులం బంగారం ఇవ్వకుండా ఆడబిడ్డలను మోసం చేయడం దారుణమన్నారు. ప్రతి మహిళకు రూ.2500 నెలకు అకౌంట్లో జమ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని అన్నారు. బాలికలకు స్కూటీలు, కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు చేయడం లేదని అన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలను ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన 400 హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్, ఎడ్ల రమేష్, డి.నరేష్, కొప్పుల శంకర్, జిల్లా నాయకులు గజ్జల శ్రీకాంత్, కొంపెల్లి అరవింద్, పుల్లెల మల్లయ్య, పున్నం రవి, గుండేటి వాసుదేవ్, సిహెచ్ రాములు, చక్రపాణి, అరవింద్, రాజ్‌కుమార్, శివ, వడ్లూరి కిషోర్, రాజకుమారి, శ్రీరాముల నారాయణ, పిల్ల రవి, గడ్డం శోభన్, సాయికుమార్, వినయ్, బోగేశ్, ఆకాశ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రుడి కుటుంబానికి రూ.1 లక్ష సహాయం

**ప్రజాపక్షం / జమ్మికుంట:** బాల్య మిత్రుడు గుండ సురేందర్ ఇటీవలే గుండెపోటుతో వడ దెబ్బకు గురై మృతి చెందాడు. బాల్య మిత్రుడు దూరమైన సురేందర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు జమ్మికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (198384) పదవ తరగతి బ్యాచ్ ఆయనతో కలిసి విద్యాభ్యాసం చేసిన మిత్రులు రూ.1 లక్ష తమవంతు చేయుతగా ఆదివారం మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. మృతి చెందిన మిత్రుడు సురేందర్ కూతురు పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ మనమంతా స్నేహమేరా జీవితం అనే నానుడికి మార్గంగా ఐక్యతతో ముందుకు సాగుతామని మృతుని కుటుంబానికి అండగా ఉంటామని మిత్రులు భరోసా ఇచ్చారు. లక్ష రూపాయల చెక్కును అందజేసిన వారిలో పాల్గొన్న బాల్య మిత్రుల సేవా సమితి మిత్ర బృందం మంద వెంకట్ రెడ్డి, కనమల్ల గణపతి, ఆర్.సంపత్ కుమార్, పెంచలయ్య, కొక్కుల రాజేందర్, డి.రాజేందర్, సాంబయ్య, సమ్మయ్య, గుడిమల్ల బలరాం, ఎ.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులుగా మధుసూదన్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట పట్టణ ఫెర్టిలైజర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా గజవెల్లి మధుసూదన్, కార్యదర్శిగా బండి కోటేశ్వర్, కోశాధికారిగా చిదురాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దోమకుంట్ల రవి, చిదురాల విజేందర్, పి.రఘురావు, చిదురాల భాస్కర్, సహాయ కార్యదర్శులుగా నాతడి బుచ్చిరెడ్డి, మాదూరి వీరేశలింగం, పైడిపల్లి కుమార్, మాడా రాజ్ కుమార్, ముఖ్య సలహాదారులుగా చిదురాల కృష్ణమూర్తి, దోమకుంట్ల రమేష్, కొమురవెల్లి జగదీశ్వర్, నల్ల సత్యనారాయణ, అయిత సురేందర్, కార్యవర్గ సభ్యులుగా ఒల్లాల సతీష్, మాదూరి వెంకటేశ్వర్లు, గౌడ కుమార్, సంపత్ కుమార్, ఎం.శ్రీనివాస్ రెడ్డి లు ఎన్నికయ్యారు.

## బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం

**ప్రజాపక్షం/జమ్మికుంట:** ప్రధాని మోదీ 12 ఏండ్ల సుపరిపాల పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు జమ్మికుంట పట్టణ మైనార్టీ మోర్చా అధ్యక్షులు యం.డి.నసీరుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బిజెపి నాయకులతో కలిసి పాఠశాలలోని తరగతి గదులు, పాఠశాల పరిసరాలను ఊడ్చడంతోపాటు నీటితో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలోని ఉర్దూ మీడియం పాఠశాలలో చెత్త చెదారం తొలగించి శుభ్రం చేసి పిల్లలు మంచి వాతావరణంలో చదువుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, జీడి మల్లేశ్, టంగుటూరి రాజ్‌కుమార్, కైలాస కోటి గణేశ్, అప్పం మధు, అదువాల శ్రీధర్, కొమ్ము అశోక్, స్వరూప, కొండ్లె నగేశ్, గంగాభవాని, పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ మానేరు డ్యామ్ సమీపంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో సివిఎస్ఆర్ మలయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేయడానికి ఈ జిమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి తోపాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం అవసరమైన మౌళిక సదుపాయాలను అందించడంలో నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, కార్పోరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మానేరు వాకర్స్ సభ్యులు, నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ధాతృత్వం పేద విద్యార్థుల పాలిట వరం



**ప్రజాపక్షం/ వేములవాడ:** స్పందించే హృదయం ఉంటే అభాగ్యులు, అనాధలు ఎవరూ ఉండరు. అనడానికి చక్కని ఉదాహరణ ఈ సంఘటన. వొజ్జల ప్రణీత ఎస్ జి టి హన్మాజీపేట ప్రైమరీ స్కూల్లో పనిచేస్తున్నపుడు ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చిట్టారి సౌజన్య, చిట్టారీ గంగాజల పరిస్థితి చూసి చలించి పోయింది. ఎలాగైనా మంచి విద్య అందించడానికి తనవంతు సహాయంగా ఏమైనా చేయాలని ఆలోచించి, స్వర్గీయ సుహాసిని మిత్రురాలైన పి జి హెచ్ ఎం గర్ల్స్ హైస్కూల్ వేములవాడ సహాయంతో చెరొక విద్యార్థిని 2020 నుండి దత్తత తీసుకొని విద్యార్థినులకు కావలసిన పుస్తకాలు, బట్టలు ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్నారు.ఇపుడు ఆ పిల్లలు మర్రిపల్లి కెజిబివి లో గంగాజల 10వ తరగతి, సౌజన్య తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో ప్రణీత టీచర్ బదిలీ పై వెళ్లి మానకొండూరు పాఠశాలలో పనిచేస్తున్నప్పటికి పిల్లలకు సహాయం అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడడం అభినందనీయం. తన తల్లిదండ్రులు కోడిపాక పవన్ కుమార్,సుహాసిని కీర్తి శేషులు అయినప్పటికీ తల్లి ఇచ్చిన మాటకు గౌరవమిస్తూ వారి కుమారుడు కోడిపాక అన్వేష్ విద్యార్థులకు సహాయం అందిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడడం అభినందనీయం, ఆదర్శనీయం. మునుముందు కూడా విద్యార్థినిలకు కావలసిన సహాయం అందిస్తామనడం వారి గొప్ప మనసును చాటుతుంది. స్నేహితులు, బంధుమిత్రులు అన్వేష్ మంచి మనసును అభినందిస్తున్నారు.

## రక్త దాతలు... ప్రాణ దాతలు

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** రక్తదానం మహోన్నతమైన సేవ అని రక్తదాతలు నిజమైన ప్రాణదాతలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానం చేయడానికి అర్హుడని ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు, అనారోగ్య సమస్యల సమయంలో రక్తం అందక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాంటి వారికి రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. యువత ఎక్కువ సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని మానవతా దృక్పథాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. గత 20 సంవత్సరాలుగా 41 సార్లు రక్తదానం చేస్తూ సమాజంలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇతరులను ప్రోత్సహిస్తున్న ఆసరా ఫౌండేషన్ అధ్యక్షుడు డా.ఆర్.గోపికృష్ణను ఈ సందర్భంగా మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పోరేటర్ శ్యామల కిరణ్, చాడ ఆనంద్, అభిషేక్, రాజు, నాగరాజు, చిరంజీవి, సభ్యులు ఎం.రవిచందర్, ఎస్.నిఖిల్, అద్వైత్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## సంఘటిత శక్తితోనే రాజకీయ ప్రయోజనాలు

### జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా జడల సురేందర్ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎన్నికల్లో 23వ వార్డు కౌన్సిలర్ జడల సురేందర్ జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియ,ఎన్నికల నిర్వహణ అధికారి సాదుల వెంకటేశ్వర్ పటేల్ పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిసింది.ఫలితాల ప్రకటన అనంతరం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం పటేల్ నూతన జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన జడల సురేందర్‌కు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపులు అన్ని రంగాల్లోనూ రాణించే సత్తా కలిగిన వారని కొనియాడారు.ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో మున్నూరు కాపుల సంఖ్యను తక్కువగా చూపుతున్నారని,ఇది సామాజిక మరియు రాజకీయ వాటాను దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దీనిని అధిగమించేందుకు ప్రతి యువకుడు బాధ్యతగా గ్రామాల్లోని ఇంటింటి వివరాలను సేకరించి,సరైన గణాంకాలను ప్రభుత్వానికి అందించాలని పిలుపునిచ్చారు.చట్టసభల్లో మున్నూరు కాపులకు రావాల్సిన సముచిత వాటాను సాధించుకునేందుకు సంఘం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా కేంద్రంలో మున్నూరు కాపుల కోసం ఒక అధునాతన కమ్యూనిటీ హాల్ మరియు పేద విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయడమే తమ తక్షణ లక్ష్యమని,దీని కోసం స్థల సేకరణకు సంబంధించి ప్రభుత్వం మరియు స్థానిక నాయకుల మద్దతును కట్టుకొని నూతన అధ్యక్షుడు ముందుకు సాగాలన్నారు.కుల సంఘం అనేది కేవలం సంఘటితం కావడం మాత్రమే కాదని,అన్ని కుల సంఘాలతో సమన్వయం చేసుకుంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన జడల సురేందర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,కుల ఐక్యత కోసం నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య,రాష్ట్ర కార్యదర్శి ఇసంపల్లి వెంకన్న పటేల్,మల్క రామస్వామి, ఎలువాక రాజయ్య,అమిరిశెట్టి రామస్వామి,బిరుదు క్రిష్ణ,తూముల శ్రీనివాస్,బండారు రామ్మూర్తి, ఆకుల మహేందర్,గంట రమేష్,వునుకొండ శ్రీధర్, విజయలక్ష్మి, హరి శంకర్, ఆకుల వివేక్ పటేల్, పూదరి మహేందర్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కుల బాంధవులు పాల్గొని నూతన అధ్యక్షుని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మానవత్వాన్ని చాటిన ప్రజాప్రతినిధులు

### మానసిక వికలాంగులైన అన్నదమ్ముల పింఛన్ కోసం హైదరాబాద్‌కు వెళ్లి లైవ్ అథెంటికేషన్ పూర్తి

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో స్పందిస్తూ మెట్‌పల్లి ప్రజాప్రతినిధులు మరోసారి తమ సేవా తత్వాన్ని చాటుకున్నారు.మెట్‌పల్లి పట్టణానికి చెందిన మానసిక వికలాంగులైన సంతు, సాయి అనే ఇద్దరు అన్నదమ్ములు ప్రస్తుతం హైదరాబాద్ లోని ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ హాస్టల్‌లో నివాసం ఉంటున్నారు.వీరి పింఛన్ కొనసాగింపునకు అవసరమైన లైవ్ అథెంటికేషన్ (వేలిముద్రల ధృవీకరణ) ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా,కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని మెట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై వెంటనే స్పందించిన తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వారి ఆదేశాల మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ అధికారి రాకేష్‌తో కలిసి స్వయంగా హైదరాబాద్‌కు వెళ్లి హాస్టల్‌లో ఉన్న సంతు, సాయిలకు లైవ్ అథెంటికేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయించారు.దీంతో పింఛన్ నిలిచిపోయే పరిస్థితి నుంచి ఆ ఇద్దరు వికలాంగ సోదరులు బయటపడ్డారు. సమస్యను అధికారిక ప్రక్రియగా కాకుండా మానవతా కోణంలో చూసి స్పందించిన ప్రజాప్రతినిధుల తీరుపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సహకరించిన తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధికారి రాకేష్‌లకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి స్పందించే ప్రజాప్రతినిధులు ఉంటేనే సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన లబ్ధిదారులకు చేరతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## రాజన్న ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం

**ప్రజా పక్షం/వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల కోసం కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం భోగంపాడు గ్రామానికి చెందిన భక్తులు కల్లం రాధిక,రాజారెడ్డి దంపతులు ఒక లక్ష ఒక వంద పదహారు రూపాయల విరాళాన్ని అందజేశారు. దాతలు సమర్పించిన విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ స్వీకరించారు. అనంతరం దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు స్వామివారి ఆశీర్వచనాలు అందజేసి, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని సమర్పించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు భక్తులు అందించే విరాళాలు ఎంతో దోహదపడుతున్నాయని ఆలయ అధికారులు తెలిపారు.

## దంపతుల ఆదర్శవంతమైన రక్తదానం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :**మెట్‌పల్లి పట్టణానికి చెందిన హమ్ తేరా సభ్యులు మంత్రి కిరణ్ కుమార్ – సంధ్య రాణి దంపతులు ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శవంతమైన రక్తదానం చేశారు.యువతలో రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించి, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, "ఇంటికొక రక్తదాత" ఉండేలా సమాజం ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా దంపతులు స్వచ్ఛందంగా బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు.రక్తదానం చేసిన మంత్రి కిరణ్ కుమార్ – సంధ్య రాణి దంపతులను రాధ్య బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రజనీకార్ రెడ్డి,టీంస్ఫర్ నిర్వాహకులు అఖిల్,రక్తదాతల అనుసంధాన కర్తలు ఉదయ్ కుమార్, శేఖర్, చైతన్య,అనిల్,అభినందించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో జెడ్‌పిహెచ్ఎస్ (బాలుర) పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాలలో గడిపిన మధుర క్షణాలు,విద్యాభ్యాసానికి సంబంధించిన అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు,విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకుంటూ జీవితంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని గౌరవిద్దాం... అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, శాతల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఒరగంటి తిరుపతి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ దేశంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడాలని తెలిపారు .భారత రాజ్యాంగం అంటే కేవలం ఓటు హక్కు మాత్రమే కాదు బావ స్వేచ్ఛ ప్రకటన సమాజంలో నీకు ప్రశ్నించే హక్కు లన్ని కల్పించింది రాజ్యాంగమే కాబట్టి రాజ్యాంగాన్ని గౌరవిద్దాం అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం రాబోయే తరాలకు నవ సమాజపు దేవుడిగా చిత్రీకరిద్దాం అన్ని అన్నారు.సమానత్వం స్వేచ్ఛ సామాజిక న్యాయం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు .అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో చాటి చెప్పేందుకు ప్రతి ఆదివారం అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతున్న నిర్వాహకులను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంగేమ్ కళ్యాణ్, జేరిపోతుల నరేష్, ఎనగందుల తిరుపతి, ఎలగందుల రమేష్, చందు పోశయ్య,బక్కయ్య, అంబేద్కర్ వాదులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన ఇంద్రసేన యూత్ సభ్యుడు



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :**మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చంద్రకళ (వెల్లుల్ల గ్రామం)కు అత్యవసరంగా 'ఏ పాజిటివ్' రక్తం అవసరం ఏర్పడింది.ఈ విషయాన్ని రక్తదాతల అనుసంధానకర్తలు ఉదయ్ కుమార్, వెంకట్ రెడ్డి, రంజిత్‌లకు కుటుంబ సభ్యులు తెలియజేశారు.సమాచారం అందుకున్న మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి, ఇంద్రసేన యూత్ సభ్యుడు బురం భానుచందర్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఆయన అందించిన రక్తంతో రోగికి తక్షణ చికిత్స అందడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని భానుచందర్ తెలిపారు.ఇప్పటివరకు 21 సార్లు రక్తదానం చేసిన ఆయన భవిష్యత్తులో 50 సార్లు రక్తదానం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.అత్యవసర సమయంలో స్పందించిన భానుచందర్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, డాక్టర్ రవి, మున్సిపల్ సిబ్బంది, ఇంద్రసేన యూత్ సభ్యులు,పేషెంట్ బంధువులు అభినందించారు.

# ఘనంగా రోడ్డు మైసమ్మ మొక్కులు



**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని వెంగలాయిపేట, బతికేపల్లి ప్రధాన చౌరస్తాల వద్ద వెలిసిన రోడ్డు మైసమ్మ దేవతకు ట్రాక్టర్ యూనియన్, గాయత్రి ఆటో యూనియన్ సభ్యులు సంప్రదాయబద్ధంగా, ఘనంగా మొక్కులు చెల్లించారు. ఏటా వర్షాలు ప్రారంభమై, వ్యవసాయ పనులు మొదలయ్యే ముందు రోడ్డు మైసమ్మకు పూజలు చేయడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆటో, ట్రాక్టర్ యూనియన్ల సభ్యులు అమ్మవారికి నైవేద్య ప్రసాదాలు సమర్పించి, యాట పిల్లలతో మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతాంగం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వెంగలాయిపేట సర్పంచ్ మోకినపల్లి గోపాల్, ఉప సర్పంచ్ కుంచె రాజేందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కదారి తిరుపతి,గాయత్రి ఆటో యూనియన్ అధ్యక్షుడు కదారి అంజయ్య వారితో పాటు యూనియన్ సభ్యులు షేక్ షకీల్, మంద రమేష్, తొంటి గంగన్న, బేక్కం అంజి, మల్యాల రవి, మడిగేల సత్తయ్య, స్వర్ణం సత్తయ్య, తడగొండ తిరుపతి,గంగస్వామి,మద్దెల అనిల్,గజ్జి హరీష్, పోరండ్ల శ్రీనివాస్,సాగర్, కదారి మహేష్,చిన్న,శ్రీధర్, సురేష్, అజయ్,రమేష్ స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు మృతి

### ప్రజాప్రతినిధుల, నాయకుల సంతాపం



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణానికి చెందిన ఎనుగందుల లింగం గౌడ్ ప్రజా ఉద్యమాలలో సుపరిచితులు ఆయన ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ఆనాటి ఉద్యమ నాయకుడు కెసిఆర్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కమిటీలో కీలకంగా బాధ్యతలు నిర్వహించిస్వరాష్ట్ర కాంక్షను ఆనాటి ప్రభుత్వాలకు వినిపించడంలో ఆయన కృషి చేశారు. ఎల్ఐసి ఏజెంట్ గా మందికి జీవన భద్రత కల్పించిన ఆయన సేవలు చిరస్మరణీయం తెలంగాణ రాష్ట్రం వచ్చాక రాయికల్ పట్టణానికి వారి సతీమణి మార్కెట్ కమిటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. ఆయన సేవలను స్మరించకుంటూ ప్రజా నాయకులు తెలంగాణ ఉద్యమకారులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## స్వగ్రామం చేరిన వలస జీవి మృతదేహం

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన జంగోని రవీందర్ (48) మస్కట్‌లో గత పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఆయన బల్దియా విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రవి మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సంఘ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కోరారు. రవీందర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆదర్శ పట్టణంగా ధర్మపురి

### మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మీ

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరిచి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు.ధర్మపురి బల్దియా పరిధిలోని 4వ వార్డులో ఆదివారం నూతన డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన జరిపారు.ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.మురుగుకాల్వల నిర్మాణం ద్వారా పారిశుద్ధ్య సమస్యలు తగ్గి ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. బల్దియా పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేస్తామని దీనికోసం ప్రజలు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎస్.దినేష్,కౌన్సిలర్లు సంగి ఆనంద్,చీపిరిశెట్టి రాజేష్,కొమురెల్లి పవన్ కుమార్,సంగనబట్ల సంతోష్,చుక్క సంధ్య భీంరాజ్,వొజ్జల లక్ష్మణ్,కో ఆప్షన్ సభ్యులు ఎస్ కె షౌకత్,గరిగె అరుణ,మున్సిపల్ అధికారులు,సిబ్బంది,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రక్తదానం – ప్రాణదానం

### ప్రాణాలను కాపాడండికోట కిరణ్ కుమార్

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధి కిరణ్ కుమార్ కోట పిలుపునిచ్చారు.18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఆరోగ్యవంతులు రక్తదానం చేయడానికి అర్హులని ఆయన తెలిపారు. రక్తదానం చేసేవారు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొన్నారు.తాను ఇప్పటివరకు 30 సార్లకు పైగా రక్తదానం చేశానని, గత 30 సంవత్సరాలుగా స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక మంది రక్తదాతలను తయారు చేస్తున్నామని తెలిపారు. రక్తం అవసరమైన సందర్భాల్లో ముందుగా పేషెంట్ బంధువులను రక్తదానం చేయడానికి ప్రోత్సహించి, వారు అందుబాటులో లేని పరిస్థితుల్లో మాత్రమే స్వచ్ఛంద వాలంటీర్లు ముందుకు రావాలని ఆయన సూచించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

### ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం / నర్సాపూర్ (జి) :** నిర్మల్ ఎమ్మెల్యే శ్రీ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నర్సాపూర్ (జి) మండలానికి చెందిన శ్రీ కండెల శ్రీకాంత్ తండ్రిని పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వారికి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామాజిక సేవలకు అరుదైన గౌరవం

**ప్రజాపక్షం /కడం, నిర్మల్ :** దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్మల్ జిల్లా వాసికి గౌరవ డాక్టరేట్ లభించింది. నిర్మల్ జిల్లాలోని కడం మండలం పెద్ద బెల్లాల్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు కొత్తపల్లి రాజేశ్వర్‌కు న్యూ ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ లభించింది. సామాజిక సేవా, విద్యా రంగంలో విశిష్ట సేవలతో పాటు సేవా కార్యక్రమాల్లో కొత్తపల్లి రాజేశ్వర్ చేసిన సేవలను గుర్తిస్తూ దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంలో ఆయనకు ఈ అరుదైన గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఫరీదాబాద్‌లో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, సామాజిక సేవకులు, విద్యావేత్తలు పాల్గొనగా, ఈ సందర్భంగా కొత్తపల్లి రాజేశ్వర్‌కు జాతీయ పురస్కారంతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు. సామాజిక సేవ రంగంలో 16 సంవత్సరాలుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సామాజిక చైతన్య కార్యక్రమాలను ప్రోత్సహించి ప్రజలకు అందించడం ద్వారా ఆయన ప్రత్యేక గుర్తింపు కలిగివున్నారు. బాధ్యతలు, యువత అభివృద్ధి, సామాజిక సంక్షేమం, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు, పేదలకు సహాయ సహకారాలు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు ఆయన ఇప్పటికీ చేపడుతున్నారు. సమాజానికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన నిర్వాహకులు ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు మిత్రులు, సామాజిక కార్యకర్తలు, నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు, డాక్టర్ కొత్తపల్లి రాజేశ్వర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సమాజ సేవా రంగాల్లో మరిన్నీ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ గౌరవం నిర్మల్ జిల్లాకు ముఖ్యంగా కడం మండలానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని వారు పేర్కొన్నారు.



# సిల్వ గుట్ట చరిత్రను చెరిపేయొద్దు

### క్రైస్తవుల ఆవేదన



**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట పట్టణంలోని చరిత్రాత్మక చరిత్రగల సిల్వ గుట్టను చెరిపేసే ప్రయత్నాలను మానుకోవాలని క్రైస్తవులు కోరారు. ఇటువంటి పవిత్ర స్థలమైన సిల్వ గుట్టను కొందరు రాజకీయ నాయకులు తవ్వి ఇక్కడ గిడ్డంగిలు కట్టాలని చూస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం వారు గుట్ట వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి తమ ఆవేదనను వెల్లడించారు. సుమారు వంద సంవత్సరాల నుండి ప్రతి ఏడాది ఈస్టర్ పండుగ రోజు క్రైస్తవులు కుటుంబాలతో కలిసి తెల్లవారుజామున ఈ గుట్ట మీదికి చేరుకొని దైవ ఆరాధనలు, సిలువ ధ్యాన ప్రార్థనలు చేస్తారని తెలిపారు. ఇక్కడికి వచ్చి ప్రార్థన చేసుకుంటే కోరికలు తీరుతాయనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఈస్టర్ రోజే కాకుండా కొందరు ప్రతి రోజు ఈ గుట్ట మీద సిలువ దగ్గరకు వచ్చి ప్రార్థన చేసుకుంటారని వివరించారు. గుట్టను తవ్వాలనే ఆలోచన ఎవరికి వచ్చినా అది మంచిది కాదని, దీనిపై పోరాటానికి క్రైస్తవులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ ఆలోచనను మానుకొని క్రైస్తవులకు అండగా ఉండాలని కోరారు. అంతేకాకుండా ఈ గుట్ట పక్కనే ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నాయని, సుమారు 4 నుండి 5 వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యానభ్యసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ స్టోరేజ్ గిడ్డంగిలు కడితే అక్కడి వాతావరణం కలుషితమై విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ఆఫ్ సౌత్ ఇండియా పాస్టర్ రెవరెండ్ ఎస్ డేవిడ్ పాల్, కమిటీ సభ్యులు అడ్డంకి బాల, బిల్లమ్ మనోహర్, శౌరి, మేదరి పాల్సన్, విజయ్, అజయ్, ప్రశాంత్, పాల్, చర్చి సభ్యులు దినేష్, దేవనందం, జోసెఫ్, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్‌కు తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత

### జిల్లా అధ్యక్షుడు కిర్మిల్ల వినోద్

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరవుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిర్మిల్ల వినోద్ తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు జెండా ఆవిష్కరణ, కార్యాలయం ప్రారంభోత్సవం ఉంటాయని పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ నుండి ప్రజా ర్యాలీ (రోడ్ షో) ప్రారంభమై గాంధీ చౌక్, వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా కొమరం భీమ్ చౌక్ వరకు సాగుతుందని తెలిపారు. అక్కడ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి, తిరిగి ర్యాలీగా గుండి రోడ్డులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయానికి చేరుకుంటారని వివరించారు. అక్కడ జెండా ఆవిష్కరించి, కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఆసిఫాబాద్ జిల్లా పార్టీ పరిశీలకులు, మాజీ మంత్రి బొడ జనార్ధన్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుండి తెలంగాణ రక్షణ సేనలో చేరికలు ఉంటాయని వెల్లడించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ నాయకులు, తెలంగాణ జాగృతి ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దుర్గం శ్యామ్ రావు, రామ్ ప్రసాద్ గౌడ్, సాయి, మైనుద్దీన్, ఆత్రం వినోద్, తిరుపతి, శ్రీనివాస్, అబ్బు పాల్గొన్నారు.




## బిసిల అభ్యున్నతికి కృషి చేస్తా

### ఆవుల రాఘవేంద్రనాథ్ యాదవ్



**ప్రజాపక్షం/మావల:** బీసీల బలోపేతానికి, వారి సర్వాంగీణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆవుల రాఘవేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని అనుకుంటలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు పోరాటాలు, ఉద్యమ కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు. బీసీల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంచాల ప్రకాష్, రావుల సోమన్న, బింగి మార్కండేయ, అప్కాం భూమారెడ్డి, రావుల రమేష్, బండి నర్సింహాచారి పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని శ్రీ లక్ష్మీ శిశు మందిర్ హైస్కూల్ 2006–07 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. చదువు పూర్తి చేసుకుని 19 సంవత్సరాల తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులంతా ఒకే చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ నాటి చిలిపి అల్లరి, పాఠశాల రోజుల్లోని మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తమ భవిష్యత్తును తీర్చిదిద్ది విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల కరస్పాండెంట్ విజేందర్ రెడ్డితో పాటు గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఉపాధ్యాయులు రవీందర్, రాజ్ కుమార్, కుమారస్వామి, బండి కుమార్, కనకయ్య, రాజలింగు, రమణారెడ్డి, దిలీప్, పూర్వ విద్యార్థులు సురేష్, ప్రవీణ్, కిరణ్, మణికంత, లావణ్య, రజిత పాల్గొన్నారు.

# వాహన తనిఖీలలో పట్టుబడ్డ నిందితులు

### ముగ్గురిపై కేసు నమోదు, అరెస్ట్, రిమాండ్

### నకిలీ పత్రాలు, ఫోర్జరీ వ్యవహారంపై కేసు

### ఆదిలాబాద్ డిఎస్‌పి ఎల్. జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం / బోథ్ :** 13 వ తేదీ ఉదయం బోథ్ కోరమాండల్ జంక్షన్ వద్ద పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక మహీంద్రా మ్యాక్స్ వాహనం పోలీసులను గమనించి వెనక్కి తిరిగి వెళ్ళేందుకు ప్రయత్నించింది. అనుమానం రావడంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, వాహనానికి సంబంధించిన చాసిస్ నెంబర్, ఇంజన్ నెంబర్‌లలో మార్పు చేసినట్లు గుర్తించారు. వాహన డ్రైవర్ ఎస్.కే.నయీంను విచారించగా మహారాష్ట్ర రలోని లాతూర్ ప్రాంతం నుండి మహీంద్రా మ్యాక్స్ వాహానాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్ పొందేందుకు మరో వాహనానికి సంబంధించిన పత్రాలు నెంబర్లను ఉపయోగించి ఫోర్జరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. విచారణలో మాక్‌నూర్ విజయ్ కుమార్ ఇంటి వద్ద అసలు చాసిస్, ఇంజన్ నెంబర్లను తొలగించి ఫోర్జరీ పనులు చేయించినట్లు వెల్లడైంది. అలాగే స్క్రాప్‌కు వెళ్ళి ఏపి23జె1036 వాహానానికి చెందిన పత్రాలను పెందూర్ ఇంద్రు వద్ద నుండి రూ. 10000లకు సేకరించి వాటిని ఉపయోగించి నకిలీ పత్రాలు రూపొందిచినట్లు తెలిసింది. ఈ ఘటనపై బోథ్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెం.140/2026 కింద కేసు నమోదు చేసి ధర్యాప్తు చేపట్టినట్టు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ అధికారులను మోసం చేయడం, నకిలీ పత్రాలు సృష్టించడం, వాహన వివరాలను ఫోర్జరీ చేయడం వంటి అంశాలపై విచారణ కొనసాగుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఇంజన్ నెంబర్లు, చేసిస్ నెంబర్లు చెరిపివేసిన వాహనాలను ప్రజలు కొనవద్దని ఒరిజినల్ ఆర్‌సి చూపిన తర్వాతనే వాహనాలను కొనాలని సూచించారు. అదే విధంగా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. చేసిస్ నెంబర్లను ఇంజన్ నెంబర్లను చెరిపి వేయడానికి ప్రయత్నించిన వారిపై సైతం చర్యలు తీసుకోబడ్డాయని తెలిపారు. నిందుతులపై ఫోర్జరీ మరియు చీటింగ్ కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసును చేదించడంలో సిఐ డి.గురుస్వామి, బోథ్ ఎస్.ఐ. వి.పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ మధన్, పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించినట్లు డిఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అభినందించారు.







## పాఠశాలను స్వయంగా శుభ్రం చేసిన ఆరెపల్లి సర్పంచ్

**ప్రజాపక్షం / మామడ :** మామడ మండలం ఆరెపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతిఒ రాజవ్వమల్లయ్య యాదవ్ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామ ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా శుభ్రం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా పరిశుభ్ర వాతావరణం కల్పించేందుకు సర్పంచ్ ఈ చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని, ప్రైవేటుకు ధీటుగా బోధనలు, అన్ని సౌకర్యాలు ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు.

## మామడ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం కార్యవర్గం ఏర్పాటు

**ప్రజాపక్షం / మామడ :** మామడ మండల ఉప సర్పంచ్‌ల సంక్షేమం మరియు హక్కుల సాధన కోసం ఏర్పాటైన మామడ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఫోరం అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా రాజారెడ్డి, పొన్కల్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ ప్రేం సింగ్, ఆరెపెల్లి, కార్యదర్శిగా రమణారెడ్డి, ఆదర్శనగర్ లు ఎన్నికయ్యారు. మండలంలోని పలు గ్రామాల ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ తాజా మాజీ ఎంపిటిసి దొడ్డ గీతారాణి సోదరుడు ఎల్మిల్ల సమ్మయ్య ఇటీవల మరణించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు.జరిగిన సమ్మయ్య దశదిన కార్యక్రమంలో ముత్తారం మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నాగినేని జగన్ మోహన్ రావు, కాలేశ్వరం దేవస్థానం డైరెక్టర్ తాడిపల్లి రాజన్న, హుజురాబాద్ కాంగ్రెస్ నాయకులు పుల్లూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను మ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మోదీ సుపరిపాలన మనకు ఆదర్శం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** భారత ప్రధాన మంత్రి పన్నెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపురం గ్రామంలో ప్రభుత్వ ఉన్నతపాఠశాల లో స్వచ్ఛపాఠశాల కార్యక్రమాన్ని బీజేపి నాయకులు నిర్వహించారు.జిల్లా బీజేపి ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పచ్చదనం పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు.చుట్టు ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు పునాదిగా ఉండాలని సూచనలు చేశారు.

# జాన్కంపేట్ గ్రామంలో చెత్త కుండీల ఏర్పాటు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలోని పలు కాలనీల్లో నూతనంగా చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో చెత్త కుండీలు లేకపోవడం వల్ల చాలా మంది ప్రజలు చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెత్త కాస్తా గాలికి, వానకు కొట్టుకుపోయి డ్రైనేజీ నాళాల్లో చేరుతోందని పేర్కొన్నారు. దీనివల్ల డ్రైనేజీలు నిండిపోయి, మురుగునీరుతో పాటు స్వల్ప వర్షానికే వర్షపు నీరంతా రోడ్లపై పారుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని వివరించారు. ఈ సమస్యను నివారించడానికి వర్షకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండటానికి ముందస్తు చర్యగా గ్రామంలోని అన్ని ప్రధాన కూడళ్లు కాలనీల్లో చెత్త కుండీలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ఎవరూ కూడా చెత్తను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకూడదని ఇండ్లలోని తడి పొడి చెత్తను గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన కుండీల్లోనే వేసి, జాన్కంపేట్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పాలకవర్గ సభ్యులు కోరారు. పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పొలం పనుల్లో ఉండగా గుండెపోటుతో రైతు మృతి



**ప్రజాపక్షం /పెగడపల్లి :** పెగడపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న ఒక రైతు గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెగడపల్లి మండలానికి చెందిన ఉట్కూరి శంకరయ్య (56) అనే రైతు రోజులాగే ఈరోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో తన ఇంటి నుండి పెగడపల్లి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ పొలం పనులు చేస్తుండగా ఆయనకు ఒక్కసారిగా చాతిలో తీవ్రమైన నొప్పి వచ్చింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శంకరయ్యను చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు.. ఆయన అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. శంకరయ్య ఆకస్మిక మరణంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘోర సంఘటనపై మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు జరుపుతున్నారు.

# కరెంట్ కోసం చెట్లు నరుకుతారా?

### హరితహారం నాటిన చేతులే.. హరితాన్ని నరికి వేయాలా?



**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయానికి వెళ్లే మార్గంలో కనిపిస్తునన ఈ దృశ్యం ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఎంత లోపించిందో స్పష్టంగా చెబుతోంది. ఒకవైపు విద్యుత్ అవసరం, మరోవైపు పర్యావరణ పరిరక్షణ, రెండూ ప్రజల జీవనానికి రెండు కళ్లలాంటి అంశాలే. కానీ ఇక్కడ పరిస్థితి చూస్తే ఒక కన్ను కాపాడేందుకు మరో కన్నే తీసేయాలా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఫోటోలో కనిపిస్తున్నట్లుగా విద్యుత్ స్తంభాలు, తీగల కింద పెరిగిన చెట్లు ఇప్పుడు విద్యుత్ సరఫరాకు అడ్డంకిగా మారాయి. విద్యుత్ శాఖ అధికారులు కొత్త కనెక్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉండడంతో చెట్లను తొలగించే పరిస్థితి ఏర్పడింది, కానీ అసలు ప్రశ్న ఏమిటంటే..ఈ చెట్లు నాటినప్పుడు అవి భవిష్యత్తులో విద్యుత్ లైన్లకు అడ్డుగా మారతాయని ఎవ్వరూ ఆలోచించలేదా? వర్షాకాలం వస్తే హరిత హారం పేరుతో లక్షల మొక్కలు నాటడం, ఫోటోలు దిగడం, లక్ష్యాలు పూర్తయ్యాయని నివేదికలు పంపడం సులభమే. కానీ ఆ మొక్క ఎక్కడ నాటబడుతోంది? ఐదేళ్ల తర్వాత ఎంత ఎత్తుకు పెరుగుతుంది? పక్కనే ఉన్న విద్యుత్ లైన్లు, రహదారులు, భవనాలకు ఇబ్బంది కలుగుతుందా? అనే ప్రశ్నలు మాత్రం అధికార యంత్రాంగం మర్చిపోతున్నట్లు కనిపిస్తోంది. పాత సామెతలో చెప్పినట్లు దున్నపోతు పోయిందని దూడను దొడ్డిలో కట్టేయండి అన్న తీరుగా సమస్య వచ్చిన తర్వాత స్పందించడం తప్పా ముందస్తు ప్రణాళిక కనిపించడం లేదు. చెట్లు నాటిన శాఖ తన పని అయిపోయిందని భావించింది. విద్యుత్ శాఖ ఇప్పుడు తన అవసరాల కోసం చెట్లను తొలగించాల్సి వస్తోంది. చివరికి నష్టపోయేది ప్రభుత్వ ధనం, పర్యావరణం, ప్రజల ప్రయోజనాలే. ఒక శాఖ చెట్లు నాటితే, మరో శాఖ వాటిని నరుకుతుంటే అభివృద్ధి గణాంకాల్లో మాత్రమే కనిపిస్తుంది కానీ నేల మీద కనిపించదు. హరిత హారం అంటే మొక్కలు నాటడమే కాదు. వాటి భవిష్యత్తును కూడా ప్రణాళికలో పెట్టడం, లేకపోతే కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి నాటిన మొక్కలను మరో శాఖ ఖర్చు పెట్టి తొలగించే విచిత్ర పరిస్థితులు కొనసాగుతూనే ఉంటాయి. జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు ఈ ఘటనను ఓ చిన్న సంఘటనగా కాకుండా పరిపాలన ఉంటే ఈ రెండింటిలో ఒక దాన్ని బల్లి ఇవ్వాల్సిన పరిస్థితి అసలు వచ్చేదే కాదు. మొక్క నాటేటప్పుడు చప్పట్లు కొట్టిన వ్యవస్థ ఆ మొక్కలను నరుకుతున్నప్పుడు కనీసం ఒక్కసారి ఆలోచిస్తే బాగుందేమో..

# అత్యాచారం చేసిన నిందితుడికి ఉరిశిక్ష విధించాలి

**ప్రజాపక్షం/వరంగల్ :** ఇటీవల ఖమ్మం నగరంలో 12 ఏండ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్యా యత్నం చేసిన కామాంధుడు ఎండి గౌస్ కు ఉరిశిక్ష విధించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి రజక కుటుంబానికి చెందిన మైనర్ బాలిక వేసవి సెలవులలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉండగా ,అదే భవనములో ఉంటున్న గౌస్ లైంగిక వేధింపులకు పాల్పడి బాలికను భవనం మీద నుండి కిందికి పడేయడంతో తీవ్ర గాయాలయి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కుటుంబానికి చెందిన మహిళ రెండు నెలల పసిపాపతో దైవదర్శనానికి వెళ్లగా అగ్రవర్ణాలకు చెందిన వారు కుల వివక్షతతో నెట్టివేయగా పసిపాప కిందపడి అక్కడే ప్రాణాలు వదిలిన సంగతి విధితమేన్నారు. పాలకులు దుండగులను కఠినంగా శిక్షించకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు పునరావృత్తమ వుతున్నాయన్నారు.

# మాదిగ హక్కుల కోసం మరో పోరాటం

### మాదిగ హక్కుల దండోరా




**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మాదిగలకు రావాల్సిన న్యాయమైన హక్కుల సాధనకు మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం నాడు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల కి విద్యా, ఉద్యోగ రాజకీయ సంక్షేమ రంగాల్లో దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం మాదిగ హక్కుల దండోరా పోరాడుతోందని తెలియజేశారు. చేవెళ్ళ డిక్లరేషన్ దళిత డిక్లరేషన్ ప్రకారం మాదిగలకు ఇప్పటికైనా కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలోని లేదర్ పార్కులన్నింటినీ పునరుద్ధరించి అందులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే లక్ష మంది మాదిగలకు ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేస్తున్నారు. దళిత బంధు స్థానంలో ఇస్తానన్న అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలులోకి తీసుకురావాలని కోరుతున్నాం, అదే విధంగా కేంద్ర ప్రభుత్వం దళితుల పట్ల చిన్నచూపుతో వ్యవహరిస్తుందని బిజేపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు అధికమవుతున్నాయని తెలియజేస్తున్నారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మాధిగలకు భాగస్వామ్యం ఇవ్వాలని అదే విధంగా త్వరలో జరగబోయే ఎంపిటీసి, జడ్పిటీసి ఎన్నికల్లో మాదిగలకు అధిక స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సమన్వయకర్త అందెల భవాని రెడ్డి, అడ్డుగ లక్ష్మణ్, అబేద్కర్ సంఘం అధ్యక్షులు, సీనియర్ నాయకులు నల్లూరి ఆనంద్ మాదిగ, బండారి అశోక్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, సుద్దాల శివకుమార్, మల్లేల కరుణాకర్, బిరుదుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# జలాల్‌పూర్ గ్రామాభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రజలు

### పిల్లలు ప్రభుత్వ బడులకే వెళ్లాలంటూ తీర్మానం



**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గ్రామపంచాయతీ, గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామప్రజలు ముక్తకంఠంతో గ్రామంలోని బడి ఈడు పిల్లలను సర్కార్ బడికి పంపుతామని తీర్మానించారు. ఫ్రీ ప్రైమరీ నుండి 5వ తరగతి వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు పంపాలని తీర్మానించారు. బడిబాట సందర్భంగా ఆదివారం జలాల్‌పూర్ గ్రామంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ గుండేటి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సుధాకర్, కిషన్‌రెడ్డి, గంగారెడ్డి, రవి, రాములు, మల్కన్న, ప్రధానోపాధ్యాయులు అభిమన్యు, ఉపాధ్యాయులు కృపాని, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విధేయుడికి విలువైన బాధ్యత

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్లె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా సర్ద గంగాధర్ కార్యదర్శిగా ఆది శ్రీనివాస్‌ను ఆదివారం గ్రామసర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ మండల అధ్యక్షులు ఎస్‌కె.చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమానికి టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్ హాజరైన నూతన గ్రామశాఖ కమిటీని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షులు ఎస్‌కె చిన్నారెడ్డి నూతన కమిటీ సభ్యులకు ఎన్నికల పత్రాలను అందజేసి మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వం మన ఇందిరమ్మ ప్రభుత్వమన్నారు. రాంసన్, ధర్మయ్య, శ్రీకాంత్, గంగాధర్, సాయగౌడ్, సుధాకర్, అశోక్, భూమేష్ పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం సమరశీల పోరాటాలు

## సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** కేంద్రంలోని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సన్నద్ధమవుతున్నారని వాటిని మరింత ముందుకు తీసుకు పోవడం కోసం విశాల మద్దతు అందజేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య వెల్లడించారు. ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ సమావేశం గుణగంటి రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీరయ్య మాట్లాడుతూ ప్రపంచంలో అమెరికన్ సామ్రాజ్యవాదం దూకుడు వలన యుద్ధం ప్రారంభమైందని, యుద్ధం వల్ల ఆయిల్ ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు పడ్డాయని ధరల పెరుగుదలతో ప్రజలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమయంలో ప్రజలను ఆదుకోవాల్సిన మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల విధానాలను అవలంబిస్తూ ప్రజలపై మరింత దాడి పెంచిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడులు చేస్తూ కార్పొరేట్లకు అనుకూలమైన లేబర్ కోడ్ను అమలు చేయడానికి ప్రయత్నం చేస్తుందని, అనేక దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాయడానికి ఈ ప్రభుత్వాలు కుటిలయత్నం చేస్తున్నాయని తెలిపారు.ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టి వెంకన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** దోపిడీ ఉన్నంత కాలం ఎర్రజెండా ప్రజా మధ్య సజీవంగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర నాయకులు పిట్టల రవి అన్నారు. బచ్చన్నపేట ఎస్వీ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న 'సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు రెండో రోజు కొనసాగాయి. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అంశంపై ఆయన క్లాసు బోధించారు. అమరవీరుల త్యాగాలను భావితరాలకు అందించేందుకు ఈ శిక్షణలని సుంచు విజేందర్ తెలిపారు. మరో సెషన్లో మూడా శోభన్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర బీజేపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్, విద్యుత్ సవరణ చట్టాలతో కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పజెప్పుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదగిరి, మండల కార్యదర్శి వెంకటేష్, నాయకులు గోపి, అజారుద్దీన్, చందు నాయక్, నారాయణ, బలరాములు, నర్సింలు, రాములు, ఎల్లయ్య, అశోక్, కనకయ్య, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సమీక్ష



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు తరిగొప్పుల మండలంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో, తరిగొప్పుల గ్రామశాఖ అధ్యక్షులు పందుగ కనకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓటర్ లిస్టులో డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు, దొంగ ఓట్లు గుర్తించి అధికారులకు పిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కత్తుల కొమురయ్య, జిల్లా కార్యదర్శి గోరంతల వీరన్న, కిసాన్ సెల్ అధ్యక్షుడు కల్వరాజు, మండల ప్రధాన కార్యదర్శి నిత్యానందం, నాయకులు మహేందర్రెడ్డి, నవీన్ కుమార్, ఇంద్రారెడ్డి, ప్రభాకర్, జోసెఫ్, మహేందర్, సదానందం, మహేందర్, వివిధ గ్రామాల బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగునీరు



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పద్మనగర్, బాల్ రెడ్డి నగర్ కాలనీల ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలు నిత్యకృత్యంగా మారాయి. రోడ్ల పై రోత పుట్టించేలా ప్రవహిస్తున్న మురుగునీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం పద్మనగర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద టీఆర్ఎస్ నాయకుడు రెడ్డబోయిన లవీర్ యాదవ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు తమ నిరసనను వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించడంలో జలమండలి, మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు తీవ్రంగా మండిపడ్డారు.

**వీధులన్నీ మురుగుమయం.. వ్యాధుల భయం**

పద్మనగర్, బాల్ రెడ్డి నగర్లలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లపై కూడా మురుగునీరు పొంగిపొర్లుతోంది. ఇండ్ల ముందు నుంచే మురుగు కాల్వలు ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇండ్ల నుంచి బయటకు రావాలన్నా, కాలినడకన వెళ్లాలన్నా జంకుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, వృద్ధులు ఈ మురుగునీటిలోనే నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీవ్రమైన సమస్యపై స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజలు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యంగా మారిందని లవీర్ యాదవ్ విమర్శించారు. వినతులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నవతెలంగాణ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కుమార్ తండ్రి ఎర్రం సమ్మయ్య వడ దెబ్బతో మృతి చెందిన విషయం తెలిసిందే.కాగా ఆదివారం టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య పరామర్శించారు. భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో సమ్మయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్, జాతీయ కౌన్సిల్ మెంబర్ కొలుగూరి సంజీవరావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు, జిల్లా నాయకులు మండల రాంబాబు, ఆకుతోట ప్రవీణ్ కుమార్ మంద జోవర్ధన్ తదితరులు ఉన్నారు.

**సతీష్ కుమార్ సుపరామర్శించిన విద్యార్థి సంఘాల నాయకులు**

నవతెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కుమార్ తండ్రి సమ్మయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని భూపాలపల్లి జిల్లా విద్యార్థి సంఘాల నాయకులు పరామర్శించారు. ఆదివారం భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో సమ్మయ్య చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సొత్కు ప్రవీణ్ కుమార్, నేరెళ్ల జోసెఫ్, కొల్లోజు దిలీప్,కుమ్మరి రాజ్ కుమార్, బొడ్డు స్వరణ్,రాజుల శివ, భూక్య వెంకటేష్, పొన్నగంటి రాజేష్, తదితరులున్నారు. అదేవిధంగా నర్సింగ్ అధికారుల జిల్లా అధ్యక్షులు జన్నుకుమార్, ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసయ్య లు సమ్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

# విద్యారంగ సమస్యలు పట్టించుకోవడంలో కాంగ్రెస్ విఫలం

**ప్రజాపక్షం/ములుగు:** రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యారంగ సమస్యలపై బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకుడు భూక్య జం పన్న తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు విద్యార్థులు కొత్త ఆశలతో పాఠశాలలకు వెళ్ళేందుకు సిద్ధంగా ఉండగా, మరో వైపు ఉపాధ్యాయులు బోధనకు సమాయత్తమయ్యారని తెలిపారు. అయితే విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన విద్యాశాఖకు ఇప్పటికీ పూర్తి స్థాయి మంత్రి లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్న సంవత్సరాలు గ దుస్తున్నప్పటికీ విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి ని నియమించకపోవడం విద్యారంగంపై ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందని జం పన్న అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో ఉపాధ్యాయుల ఖాళీలు, మౌలిక వసతుల కొరత, భవనాల మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. ఎ న్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చి విద్యార్థుల తల్లిదండ్రుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్ర భుత్వం ఇప్పుడు పాఠశాలల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.

విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న ఈ సమయంలోనైనా ప్రభుత్వం వెంటనే విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమిం చి రాష్ట్రంలోని పాఠశాలల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని జంపన్న డిమాండ్ చేశారు.

# రాష్ట్ర స్థాయిలో డఫోడిల్స్ పాఠశాలకు విశిష్ట గుర్తింపు

## గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న చైర్మన్ చింతల నరేందర్



**ప్రజాపక్షం / నర్సంపేట :** విద్యా రంగంలోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందంజలో నిలుస్తున్న నర్సంపేట డఫోడిల్స్ పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ప్రకటించిన రాష్ట్ర స్థాయి అవార్డుల్లో విశిష్ట సేవల విభాగంలో డఫోడిల్స్ పాఠశాల ఎంపికైంది. ఈ సందర్భంగా హైదరాబాద్లోని రాజ్భవన్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా డఫోడిల్స్ పాఠశాల చైర్మన్ చింతల నరేందర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రక్తదానంపై విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించడం, స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహించడం, సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు డఫోడిల్స్ పాఠశాలకు ఈ గుర్తింపు లభించింది. విద్యార్థుల్లో మానవతా విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించే దిశగా పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకోవడం విశేషంగా నిలిచింది. అవార్డు స్వీకరించిన అనంతరం చైర్మన్ చింతల నరేందర్ మాట్లాడుతూ డఫోడిల్స్ పాఠశాల లక్ష్యం కేవలం విద్యను అందించడం మాత్రమే కాదని, సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దడమని తెలిపారు. విద్యార్థుల్లో సేవా దృక్పథం, మానవతా విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో నర్సంపేటలో అగ్రస్థానంలో నిలిచిన డఫోడిల్స్ పాఠశాల, ఇప్పుడు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందడం ద్వారా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. విద్యలో ప్రతిభ, సేవలో నిబద్ధత అనే ద్వంద్వ లక్ష్యాలతో ముందుకు సాగుతున్న డఫోడిల్స్ పాఠశాల నర్సంపేట ప్రాంతానికి గర్వకారణంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సంక్షేమం కోసం సిఎస్ఆర్ మద్దతు

## జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్నాయక్




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల సహకారంతో ఆదివారం మహబూబాబాద్ రైతులకు ఉచితంగా వ్యవసాయ స్ప్రే పంపులను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ (ఎన్ఎస్ఎస్టి) సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జాటోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందించడం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే, వ్యవసాయ సమాజ సంక్షేమం మరియు సాధికారత కోసం సిఎస్ఆర్ మద్దతును అందిస్తున్నందుకు ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఆయన అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడానికి, రైతులపై భారాన్ని తగ్గించడానికి మరియు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.